# ఫ్రీ బస్సు ప్రయాణంపై మహిళల మండిపాటు

## ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి దిమ్మదిరిగే షాక్ ఇచ్చిన మహిళలు

మునుగోడు, అక్టోబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు ప్రయాణం ఎలా ఉందని తెలుసుకోబోయిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మహిళలు షాక్ ఇచ్చారు. రాజగోపాల్‌రెడ్డి ఆదివారం మునుగోడు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులతోపాటు మునుగోడు బస్టాండ్‌ను పరిశీలిస్తున్న సమయంలో బస్టాండ్‌లోకి వచ్చిన ఆయన ఆర్టీసీ బస్సు ఎక్కి మహిళలతో మాట్లాడారు. ఫ్రీ బస్సు సర్వీస్ ఎలా ఉంద ని మహిళలను ఎమ్మెల్యే ప్రశ్నించగా, ఆయనకు ఊహించని సమాధానాలు ఎదురయ్యాయి. ప్రస్తుతం అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ సంభాషణ సాగిందిలా...

- **రాజగోపాల్‌రెడ్డి:** ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది?
- **మహిళలు :** డబ్బులు ఇచ్చి టికెట్ కొన్నవాళ్లు నిలబడుతున్నారు సార్. మేం కూసోని పోతున్నం. ఇది కరెక్ట్ కాదు.
- **రాజగోపాల్‌రెడ్డి:** ఉచిత బస్సు సౌకర్యం సంతోషంగా ఉందా?లేదా?
- **మహిళలు :** ఏం సంతోషం! జాబ్ చేసుకునే వాళ్లకు తప్ప కూలీనాలి చేసుకునే మాకు ఏమన్నా ఉపయోగం ఉందా?



మునుగోడులో ఆర్టీసీ బస్సులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

- **రాజగోపాల్‌రెడ్డి :** టికెట్ డబ్బులు మిగులుతున్నయి కదా?
- **మహిళలు :** మేం ఏమన్నా రోజు పోతున్నమా, మాకేం పని లేదా, ఇంతకు ముందు ఇంత రష్ ఉండకపోతుండే. ఫ్రీ బస్ అనేసరికి ఒకరి మీద ఒకరు పడుతున్నారు.



### స్కందమాతా రూపంలో అమ్మవారు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన సోమవారం బాసర సరస్వతీ అమ్మవారు స్కందమాతా రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. ఆలయంలో సుహాసిని పూజ, మంత్రపుష్పం, మూల నక్షత్రపూజ, అర్చకులు నిర్వహించారు. ఆరో రోజు భక్తులకు సరస్వతీ అమ్మవారు కాత్యాయని రూపంలో దర్శనం ఇవ్వనున్నారు. - బాసర

# సీట్ల కోసం సిగపట్లు

## మక్తల్‌లో ఆర్టీసీ బస్సులో మహిళల ఘర్షణ

మక్తల్, అక్టోబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల మధ్య కొట్లాటలు ఆగడం లేదు. నిత్యం ఏదో ఓ చోట గొడవలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా నారాయణపేట జిల్లా మక్తల్ బస్టాండ్‌లో ఆగి ఉన్న బస్సులో సీట్ల కోసం ఇద్దరు మహిళలు సిగపట్లు పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా కేంద్రం నుంచి గద్వాల వెళ్లే బస్సు సోమవారం ఉదయం 8:15 గంటలకు మక్తల్ బస్టాండ్‌కు వచ్చింది. ఈ సమయంలో మహిళలు తోసుకుంటూ బస్సెక్కారు. సీటు విషయంలో ఇద్దరి మధ్య మొదలైన గొడవలో సిగపట్లు పట్టుకున్నారు. తోటి ప్రయాణికులు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా.. వాళ్లు వచ్చి మొత్తం ఏడుగురిని పీఎస్‌కు తరలించారు. ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డిని వివరణ కోరగా.. ప్రయాణికుల గొడవ తమ దృష్టికి రాలేదని సమాధానం ఇచ్చారు.



నారాయణపేట జిల్లా మక్తల్ బస్టాండ్‌లో ఆగి ఉన్న బస్సులో సీట్ల కోసం ఘర్షణ పడుతున్న మహిళలు




